teluguislam.net



# సంతోష సమయంలో సమ్మతమైనవి

**109వ అంశం** **పురుషులు ఘాటైన వాసన గల సుగంధం పూసుకోవచ్చు గాని దాని రంగు కొట్టొచ్చినట్లుగా కనిపించరాదు. స్త్రీలు మంచి రంగువున్న సుగంధం పూసుకోవటం సమ్మతమేగానీ, దాని సువాసన ఘాటుగా, మత్తెక్కించే విధంగా ఉండకూడదు.**

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "పురుషులు వాడే సువాసన ఘాటుగా ఉండాలి. స్త్రీలు ఉపయోగించే సుగంధం రంగు ప్రస్ఫుటంగా ఉండాలి గాని పరిమళం ఘాటుగా ఉండకూడదు." (తిర్మిజీ-2787 సహీహ్).[1]

**110వ అంశం** **అలజడులకు ఆస్కారం లేదనుకుంటే చిన్నారి బాలికలు సంతోష సమయాల్లో డప్పు వాయిస్తూ మంచి మంచి గేయాలు ఆలపించవచ్చు.**

హజ్రత్ రబీ బిన్తె మవూజ్ (ర.అన్హా) ఇలా అంటున్నారు: "నా వివాహం జరిగినప్పుడు దైవప్రవక్త (స) వచ్చారు. మీరు కూర్చున్నట్లే (అంటే ఉల్లేఖకులు) ఆయన (స) నా పడకపై కూర్చున్నారు. ఆ సమయంలో మా తెగకు చెందిన కొంతమంది చిన్నారి బాలికలు డప్పు వాయిస్తూ, బద్ర్ యుద్ధంలో వీరమరణం పొందిన మా కుటుంబ పెద్దలకు నివాళులర్పిస్తూ గేయాలు పాడుతున్నారు. అంతలోనే వారిలోని ఒక బాలిక, "మన మధ్యన ఒక ప్రవక్త ఉన్నారు. రేపు జరుగబోయేది కూడా ఆయనకు తెలుసు" అని పాడింది. ఇది వినగానే ఆయన (స), "ఈ చరణం మాత్రం వద్దు, ముందు మీరు పాడినదే పాడుకోండి" అన్నారు - ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[2]

**111వ అంశం** **మహిళలు బంగారు నగలు, పట్టు వస్త్రాలు ధరించటం సమ్మతమే.**

హజ్రత్ అబూ మూసా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "బంగారం, పట్టు నా అనుచర సమాజంలోని స్త్రీలకు సమ్మతమే. కాగా; ఇవి పురుషులకు హరామ్ (అధర్మం, నిషిద్ధం)." (నసాయి-5148 సహీహ్).[3]

**112వ అంశం** **తెల్లని వెంట్రుకలకు గోరింటాకు తైలం వ్రాసుకోవటం సమ్మతమే.**

హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స)ఇలా ప్రవచించారు: "వృద్ధాప్యం (లోని తెల్లని వెంట్రుకలను) మార్చటానికి గోరింటాకు తైలం, వస్మ రాసుకోవటం చాలా మంచిది." - (అబూదావూద్-4205 సహీహ్, ఇబ్నుమాజా-3622 సహీహ్).[4]

---

1. సహీహ్ సుననె తిర్మిజీ, లిల్ అల్బానీ - రెండవ భాగం, హ.నెం. 2238
2. కితాబున్నికాహ్ - బాబు జరబుద్దఫ ఫిన్నికాహి వల్ వలీమా
3. సహీహ్ సుననె నసాయి, లిల్ అల్బానీ -మూడవ భాగం, హ.నెం.4754
4. సహీహ్ సుననె అబీదావూద్, లిల్ అల్బానీ - రెండవ భాగం, హ.నెం.3542